# మంత్రపు మామిడి చెట్టు
## వేమూరి వేంకటేశ్వరరావు

అనగా అనగా, ఒక ఊరు బయట ఒక పూరి గుడిసెలో ఒక ముసలమ్మ ఉండేది. మనిషి ఎప్పుడూ ధుమ ధుమ లాడుతూ, దుఃఖ పడుతూ, ఉండేది. అందుకనే ఆమెకు దుఃఖమ్మ అన్న పేరు వచ్చిందని ఆ ఊళ్లో ఒక పుకారు ఉంది. దుఃఖమ్మ మంత్రకత్తె అనీ, అందుకనే ఆమెని ఊరి బయటకు ప్రజలు తరిమేసేరని మరొక వదంతి ఉంది. ఇందు మూలంగా దుఃఖమ్మకి మంత్రాల ముసలమ్మ అని మరో పేరుంది.

మంత్రాల ముసలమ్మ గుడిసె వాకట్లో ఒక గున్న మామిడి చెట్టు ఉంది. అదేమి ఆశ్చర్యమో కాని, ఆ చెట్టు ఏడాది పొడుగునా కాయలు కాసేది. ముసలమ్మ మంత్ర మహిమ వల్లనే మామిడి చెట్టు ఏడాది పొడుగునా కాయలు కాస్తున్నాదని అంతా అనుకునే వారు.

ఆ గున్న మామిడి చెట్టు నుండి వేలాడుతూన్న మామిడి కాయలని చూసుకుని ముసలమ్మ మురిసి పోతూ ఉండేది. మన ముసలమ్మవే కాదు, ఆ ఊళ్లో ఉన్న కుర్రకారు కళ్లన్నీ ఎప్పుడూ ఆ కాయల మీదే ఉండేవి. కను మరుగయితే చాలు, కుర్రాళ్లు చెట్టెక్కి కాయలు కోసేసుకుని పరుగెత్తుకుని పారిపోయేవారు. కుర్రాళ్లు కాకపోతే కాకులు. అప్పుడప్పుడు లోకులు కాకుల కంటె అన్యాయంగా తయారయి కాయలు కోసేసే వారు. వచ్చే పోయే దొంగలని కాయలేక విసిగి వేసారి పోయింది, దుఃఖమ్మ.

ఇలా ఉండగా ఒక రోజున ఒక సిద్ధుడు వచ్చి ముసలమ్మ తలుపు తట్టేడు. తలుపు తెరచిన ముసలమ్మకి మనిషి కనిపించ లేదు కానీ, కాళ్ల వరకూ పెరిగిన గెడ్డం, చంకలో దండం, చేతిలో కమండలం కనిపించేయి. "అమ్మా, ఆకలి. ఈ సన్యాసికి పట్టెడు అన్నం పెట్టి పుణ్యం కట్టుకో తల్లీ" అన్న మాటలు వినిపించేయి. పిల్లికి బిచ్చం పెట్టని దుఃఖమ్మ మనస్సులో ఒక ఊహ మెరిసింది. ఆ సిద్ధుడికి తనకున్న దాంట్లోనే కొంత పెట్టింది. సంతోష పెట్టింది.

కడుపు నిండిన సిద్ధుడు సంతృప్తితో 'బ్రేవ్' మని త్రేన్చేడు. ఏదయినా వరం కోరుకోమని ముసలమ్మతో చెప్పేడు.

ముసలమ్మ పన్నిన పన్నాగం ఫలించింది. ఆడబోయిన తీర్థం ఎదురవుతూ ఉంటే ఇంకా ఆలస్యం ఎందుకని, "స్వామీ, నేను తప్ప నా మామిడి చెట్టు కాయలని ఎవరేనా ముట్టుకుంటే వాళ్లంతా ఆ చెట్టుకే అలా అంటి పెట్టుకుని ఉండిపోవాలి. నేను మంత్రం వేసి విడిపించే వరకు పట్టు విడకూడదు. ఇదే నా చిన్ని కోరిక."

సిద్ధుడు 'సరే' అని చెప్పి ఆ గున్న మామిడి చెట్టు మీద మంత్రించిన విభూతి జల్లి వెళ్లిపోయాడు.

మరునాడు దుఃఖమ్మ ఊళ్లో పనులు చూసుకొని ఇంటికి వచ్చేసరికల్లా చెట్టు కొమ్మలని అంటిపెట్టుకుని ముగ్గురు కొంటె కుర్రాళ్లు వేలాడుతూ కనిపించేరు. ముసలమ్మ కనబడగానే వలవలా ఏడిచేరు. చెట్టు పట్టు నుండి విడిపించమని ప్రాధేయ పడ్డారు.

ముసలమ్మ కుర్రాళ్లని చూసి కూడా చూడనట్లు నటించి, చెట్టు కొమ్మని వేలాడుతూన్న ఒక కాయని కోసి, ఆ కాయని కుర్రాళ్లకి ఎదురుగానే కత్తిపీటతో ముక్కలుగా కోసి, ఆ ముక్కలని ఉప్పు, కారంలో ఊర వేసింది.

''మళ్లా చెట్టు మీద చెయ్యి వేస్తే కత్తిపీటతో ముక్కు, చెవులూ పరపరా కోసి ఆవకాయ పెడతాను. మారు మాట్లాడితే మిగిలిన ముక్కలని కాకులకి, గద్దలకి ఎగరేస్తాను. ఈ మాటుకి పోనీ కదా అని వదిలేస్తున్నాను'' అని బెదిరించి దుఃఖమ్మ కుర్రాళ్లని వదిలి పెట్టింది.

మర్నాడు తెల్లారే సరికి కొమ్మ కొమ్మనీ కుర్రాళ్లు వేలాడుతున్నారు. మరీ ఎత్తుగా ఉన్న కొమ్మని అంటి పెట్టుకుని కాకులు, పిచుకలు గోల పెడుతున్నాయి. చంకలోని గొడుగుతో కొమ్మని వంచి, కాయని కొయ్యడానికి ప్రయత్నం చేసిన లబోడాశంకం కూడా గొడుగు కర్రతో సహా చెట్టునుండి వేలాడుతున్నాడు. చింత జిగురేసి అంటించినట్లు అందరూ చెట్టుకి అంటుకు పోయారు.

దుఃఖమ్మకి ఒళ్లు మండింది. దుఃఖం వచ్చింది. మంత్రం నేర్చుకున్నంత మాత్రాన సరిపోయిందా. దానిని వాడ గలిగే తెలివి కూడా ఉండాలి. ఇలా ఎంత సేపని కుర్రాళ్లని బంధిస్తుంది? మరో మార్గం లేక చెట్టుని అంటి పెట్టుకుని ఉన్న పరివారాన్నంతా విడిపించింది. అవకాశం రాకపోతుందా అనుకుంది.

కొన్ని రోజులు గడచిన తర్వాత అనుకున్న అవకాశం రానే వచ్చింది. ఒక రోజున దుఃఖమ్మ ఆవకాయ కలుపుకుని అన్నం తింటూ ఉంటే ఎవరో వచ్చి తలుపు తట్టేరు. ఎంగిలి చేత్తోటే వెళ్లి తలుపు తెరచిన దుఃఖమ్మ నిర్ఘాంత పోయింది. ఎదురుగా వచ్చి నిలబడ్డది యమభటుడు!

' 'దుఃఖమ్మా, నీ కాలం నిండింది. ఇక వెళదాం పద'' అన్నాడు యమభటుడు.

' 'అప్పుడేనా?'' అనుకుంది దుఃఖమ్మ. యమభటుడుతో వాదించి ప్రయోజనం లేదని దుఃఖమ్మకి తెలుసు. అందుకని,

''వచ్చావా, నాయనా యనే! చూడు బాబూ, నా చెట్టుని కాసిన కాయలతో పెట్టిన ఆవకాయ ఎలా ఘుమఘుమ లాడిపోతోందో, చూడు. ఈ అంట్ల చేత్తో వస్తే ఏమి బాగుంటుంది? నువ్వే చెప్పు. ఈ చేతులు కడుక్కొని, ఆ అవకాయ జాడీని చంకనెట్టుకుని చక్కా వస్తాను. ఈ లోగా నువ్వు ఆ చెట్టుని కాసిన పండొకటి కోసుకుని తింటూ ఉండు బాబూ, ఇప్పుడే వస్తాను,'' అని చెప్పింది దుఃఖమ్మ.

పోనీలే, అందాకా ఒక మామిడి పండు కోసుకుని తిన్నంత మాత్రాన ఒరిగి పోయే నష్టం ఏముంటుందిలే అని నచ్చ చెప్పుకుని, దోరగా పండిన కాయని ఎంచుకుని చెట్టు కొమ్మని వంచి కోయబోయాడు. ఇంకేముంది. యమభటుడు కాస్తా చెట్టు కొమ్మకి అంటుకుపోయి వేలాడడం మొదలు పెట్టేడు. ఈ వ్యవహారం అంతా కిటికి తలుపు చాటు నుండి చూసి, ''దొంగనాయాలకి తగిన శాస్తి జరిగింది'' అని ముసలమ్మ సంతోషించింది.

ఈ పరిస్థితి అక్కడ యమలోకంలో పెద్ద తంటానే తెచ్చి పెట్టింది. తిరిగి రావలసిన భటుడు రాక పోవడంతో యమలోకం అంతా యమాగా తల్లడిల్లి పోతోంది. భటుడు పోతే పోయేడని ఊరుకుందికి వీలా? ఆ భటుడి 'కోటా'కి సరిపడా చావ వలసిన వాళ్లు చావకుండా భూమిమీద ఉండి పోయారు. దీని పర్యవసానంగా పుట్టవలసిన వాళ్లు వేళకి పుట్టకుండా సృష్టి ఆగి పోయింది. ఇంకా ఆలశ్యం చేస్తే పరిస్థితి విషమిస్తుందని యమధర్మరాజే స్వయంగా బయలుదేరి వచ్చి ముసలమ్మ తలుపు తట్టేడు.

''రా, నాయనా. వచ్చావా! నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఆ దున్నపోతుని అలా ఆ మామిడి చెట్టుకి కట్టి, ఇంత గడ్డేసి, వచ్చి ఇక్కడ పీటేసుక్కూచున్నావంటే నీక్కూడా ఇంత పప్పూ అన్నం పెట్టి ఇంత గడ్డ పెరుగు వేస్తాను. కడుపులో చల్ల....''

''ముసలమ్మా! నీ నాటకం కట్టి పెట్టి వెంటనే నా వెంట రా'' గర్జించేడు, యముడు.

తన పప్పులు యమధర్మరాజు దగ్గర ఉడకవని గ్రహించి, దుఃఖమ్మ ఆవకాయ జాడీని చంకని పెట్టుకుని, ''పద బాబూ పద'' అని బయలు దేరింది.

తనొచ్చిన పని ఇంత సునాయాసంగా అయిపోతుందని యమధర్మరాజు కలలో కూడా అనుకోలేదు. ఎనుబోతు మీద ఎక్కి ధర్మలోకానికి బయలుదేరేడు. వెనకాతలే దుఃఖమ్మ.

''స్వామీ, నా సంగతి మరచి పోయారా'' అని చెట్టు నుండి వేలాడుతూన్న యమభటుడు వెనకనుండి మొర పెట్టుకున్నాడు.

యమధర్మరాజుకి విడుపు మంత్రం తెలీదు. అందుకని వెనక్కి తిరిగి, ''దుఃఖమ్మా, నీ రోజులింక అయిపోయాయి కదా. ఇంక ఆ భటుణ్ణి విడిపించేయ్'' అని ఒక హుకుం జారి చేసేడు.

''నువ్వు నన్ను విడిపిస్తేనే నీ భటుడ్ని నేను విడిపిస్తాను'' అని బేరం పెట్టింది దుఃఖమ్మ.

యమధర్మరాజుకి గొంతుకలో పచ్చి వెలక్కాయ పడ్డంత పనయింది. ఒక్క నిమిషం ఆలోచించి, ''దుఃఖమ్మా, చివికి శిథిలం అయిపోతూన్న నీ శరీరంలోనికి మళ్లా నీ ప్రాణాన్ని జొప్పించి ఏమి ప్రయోజనం? కాని నీ కోరిక ప్రకారం నిన్ను, అంటే నీ పేరుని, ఈ భూలోకంలో చిరకాలం ఉండేలా చేస్తాను. నా భటుణ్ణి ఒదిలేయ్'' అని బేరం పెట్టేడు. ముసలమ్మ ఒప్పుకుంది.

అందుకనే నేటికీ ఈ లోకం దుఃఖమయంగా ఉంది.